# సాక్షి మంచిర్యాల

శనివారం । 2 । సెప్టెంబర్ । 2023






### ఆర్టీసీకి 'రాఖీ' పండుగ..!

నష్టాల్లోని ఆర్టీసీకి రాఖీ పండుగ కలిసొచ్చింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను తిప్పటంతో అనుకున్న టార్గెట్‌కు మించి ఆదాయం సమకూరింది. 8లో▸



### రద్దీగా బెల్లంపల్లి రైల్వేస్టేషన్

బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ప్రయాణికులతో రద్దీగా మారింది. సికింద్రాబాద్ – బల్లార్షా, కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌ల మధ్య రెండు ప్రధాన రైళ్లను బెల్లంపల్లి నుంచి నడుపుతుండడంతో ప్రయాణికుల తాకిడి పెరిగింది. 8లో▸

గరిష్టం/కనిష్టం
33.3 /26.3

### వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమౌతుంది. వాతావరణం చల్లబడుతుంది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### కేసుల పరిష్కారానికి సహకరించాలి

- జిల్లా జడ్జి ప్రభాకరరావు



చెన్నూర్ కోర్టులో అధికారులతో జిల్లా జడ్జి

చెన్నూర్: కేసుల పరిష్కారానికి అందరూ సహకరించాలని జిల్లా జడ్జి కె.ప్రభాకరరావు కోరారు. ఈనెల 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కోసం శుక్రవారం అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. చెన్నూర్ కోర్టు పరిధిలో అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి ఉదయ్‌కుమార్, చెన్నూర్ జడ్జి సంపత్, జైపూర్ ఏసీపీ మోహన్, చెన్నూర్ సీఐ వాసుదేవరావు, న్యాయవాదులు, ఎస్సైలు పాల్గొన్నారు.

**కేసుల పరిష్కారానికి కృషి చేయాలి**

లక్సెట్టిపేట: పెండింగ్ ఉన్న కేసులను రాజీపడేలా చేసి పరిష్కారానికి కృషి చేయాలని జూనియర్ సివిల్ జడ్జి అసదుల్లా షరీఫ్ అన్నారు. మండల కేంద్రంలోని మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో న్యాయవాదులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈనెల 9న నిర్వహించే లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని సూచించారు. ఈమేరకు కక్షిదారులతో మాట్లాడాలని తెలిపారు. రాజీ పడితే ఇరువారాలు గెలుస్తాయన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కారుకూరి సురేందర్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ఏజీపీ పద్మ, సీఐ కృష్ణ, ఎస్సై లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

మంచిర్యాలఅర్బన్: సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జాక్టో ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న విద్రోహ దినం పాటించారు. ఈమేరకు శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. సీపీఎస్ విధానం ఉపాధ్యాయులకు గుదిబండగా మారిందన్నారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏవో రాజేశ్వర్ రావుకు వినతిపత్రం అందజేశారు. జాక్టో నాయకులు శంకర్‌గౌడ్, పోకల వెంకటేశ్వర్లు, టీఎస్‌టీడబ్ల్యూటీయూ ప్రధాన కార్యదర్శి సంతోషం తదితరులు పాల్గొన్నారు.

### నేడు సర్టిఫికెట్ల పరిశీలన

మంచిర్యాలఅర్బన్: కేజీబీవీలో తాత్కాలిక, ఒప్పంద ప్రాతిపదికన ఉపాధ్యాయుల నియామకానికి పరీక్ష రాసిన అభ్యర్థుల నియామకం తర్వాత ఏర్పడిన ఖాళీల భర్తీకి శనివారం సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. సీఆర్టీ తెలుగు, సీఆర్టీ ఫిజికల్ సైన్స్–1, పీజీ సీఆర్టీ కెమిస్ట్రీ –1, పీజీ సీఆర్టీ నర్సింగ్–1 భర్తీకి 1:3 నిష్పత్తిలో రోస్టర్ కమ్ మెరిట్ అభ్యర్థులను ఎంపిక చేసి సర్టిఫికెట్ పరిశీలన చేస్తామన్నారు. ఇందులో భాగంగా సెల్‌ఫోన్ ద్వారా అభ్యర్థులకు సమాచారం అందించారు. ఉదయం 11 గంటలకు విద్యాశాఖ కార్యాలయానికి హాజరుకావాలని తెలిపారు.

### బీసీలందరికీ రూ.లక్ష సాయం అందించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్..



రాస్తారోకోలో బీసీ కులవృత్తిదారులు, నాయకులు

దండేపల్లి: అర్హులైన బీసీ కుల వృత్తుల వారందరికీ రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ డిమాండ్ చేశారు. దండేపల్లిలో బీసీ కులవృత్తులవారితో కలిసి శుక్రవారం రాస్తారోకో చేశారు. దండేపల్లి బస్టాండు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి అక్కడే బైఠాయించారు. రూ.లక్ష ఆర్థిక సాయం అంతా బీఆర్‌ఎస్ నాయకులకు ఇస్తున్నారని ఆరోపించారు. అర్హులందరికీ పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లక్సెట్టిపేట సీఐ కృష్ణ, దండేపల్లి ఎస్సై ప్రసాద్ ఘటన స్థలానికి చేరకుని, నచ్చజెప్పే ప్రయత్నం చేసిన వినిపించుకోలేదు. తహసీల్దార్ రావాలని డిమాండ్ చేయడంతో తహసీల్దార్ సంధ్యారాణి అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. అర్హుల వివరాలకు సంబంధించి బీజేపీ ఆధ్వర్యంలో దరఖాస్తులను తహసీల్దార్‌కు అందజేశారు. నిరసనలో పార్టీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, మండల ఇన్‌చార్జి ప్రభాకర్, నాయకులు రవిగౌడ్, కిషన్, సురేందర్, శ్రీనివాస్, సత్తయ్య, రాకేశ్, అనిల్, సత్తయ్య, వెంకటేశ్, సత్యనారాయణ, తులసి, మల్లేశ్, శేఖర్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు తడబాటు!

- ఓటరు నమోదుపై ఆసక్తి చూపని యువత
- రాష్ట్రంలోనే అత్యల్పంగా 'మంచిర్యాల'లో నమోదు
- రెండు రోజులు నమోదుకు ప్రత్యేక శిబిరాలు
- సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన



మంచిర్యాల పట్టణంలో ఓటరు నమోదుపై బీఎల్ వోలకు అవగాహన కలిపిస్తున్న తహసీల్దార్ భోజన్న

**రెండో ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకారం**

| నియోజకవర్గం | 18 నుంచి 19ఏళ్ల ఓటర్లు | మొత్తం ఓటర్లు |
|---|---|---|
| చెన్నూరు | 2,487 | 1,77,628 |
| బెల్లంపల్లి | 1,693 | 1,61,907 |
| మంచిర్యాల | 2,657 | 2,50,458 |
| మొత్తం | 6,837 | 58,9993 |



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం. తమను పాలించే వారిని తామే ఎన్నుకునేందుకు ఇచ్చే గొప్ప అవకాశం. ఇలాంటి ఓటు నమోదు, వినియోగంపై రాష్ట్ర ఎన్నికల సంఘం విస్తృతంగా ప్రచారం చేస్తోంది. అయితే ఇప్పటికీ కొందరు ఓటరుగా నమోదుకు ఆసక్తి చూపడం లేదు. అలసత్వం వహిస్తున్నారు. జిల్లాలో మంచిర్యాల నియోజకవర్గం రాష్ట్రంలోనే అత్యల్పంగా కొత్త ఓటర్లు ఉన్నట్లు గుర్తించారు. ఇక్కడ 18 నుంచి 19 ఏళ్ల జనాభాకు తగినట్లుగా ఓటర్లు నమోదు కాలేదు. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల్లో ఒక్క మంచిర్యాలలోనే జనాభాకు తగినట్లుగా కొత్త ఓటర్లు నమోదు కాలేదు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లా జనాభా 80,7037 కాగా, 2014లో జరిగిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 82,0137, 2023 నాటికి 87,49,90 జనాభా ఉంటారనే అంచనా ఉంది. గత నెలలో విడుదలైన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 5,89,993 మంది ఓటర్లు ఉన్నారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులు పూర్తయ్యాక, అక్టోబర్ 4న తుది జాబితా ప్రకటిస్తారు. అప్పుడు ఈ సంఖ్య కాస్త పెరగనుంది. ప్రస్తుత ఓటర్లతో లెక్కిస్తే మొత్తం జనాభాలో 67 శాతం వరకు ఓటర్లుగా ఉన్నారు.

**పట్టణాల్లోనే వెనకబాటు**

మంచిర్యాల నియోజకవర్గంలో 2.50 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 18 నుంచి 19 ఏళ్ల వరకు ఉన్న ఓటర్లు కేవలం 2,657 మంది ఉన్నారు. అంటే మొత్తం ఓటర్లలో ఒకశాతమే. ఇది ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే అత్యల్పం. జిల్లా కేంద్రం పరిధిలోనే 1.50 లక్షల జనాభా ఉంది. ఇక్కడ 86 వేల మంది ఓటర్లు ఉన్నారు. నస్పూర్ మండలంలో 61 వేల ఓటర్లు ఉన్నారు. పట్టణాల్లో చాలా మంది యువతీ, యువకులు ఉన్నా చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. వీరు ఓటరు నమోదుకు దూరమవుతున్నారు. కుటుంబంలో పెద్దవారు తమ పిల్లల్ని ఓటరు నమోదు చేసేందుకు చొరవ చూపాలని అధికారులు సూచిస్తున్నారు.

**రెండు రోజులు ప్రత్యేక శిబిరాలు**

ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త పునరీక్షణ కార్యక్రమం మొదటిసారి గత నెల 26, 27న నిర్వహించగా, రెండోసారి, ఈ నెల 2, 3 తేదీల్లో చేపడుతున్నారు. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ఈ రెండు రోజులు ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారు. కొత్తగా ఓటరు నమోదు కోసం ఫాం 6, ఆధార్ అనుసంధానం కోసం 6బీ, ఓటరు తొలగింపు, చేర్పులకు ఫాం7, చిరునామా మార్పు కోసం ఫాం 8లో వివరాలు నింపి స్థానిక బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌వో)కు ఇవ్వాలి. ఆన్‌లైన్‌లో voter.eci.gov.in ఓటరు హెల్ప్‌లైన్, ఎన్‌వీఎస్పీతో కూడా దరఖాస్తులు చేసుకోవచ్చు. అయితే ఓటరుగా నమోదుకు ఎన్నికల్లో అభ్యర్థులు నామినేషన్లు వేసే వరకు అవకాశం ఉన్నప్పటికీ ముందస్తుగా నమోదు చేసుకుంటే గుర్తింపు కార్డు పొంది సులువుగా ఓటేసే అవకాశం ఉంటుంది.

### ఓటరుగా నమోదు చేసుకోవాలి



18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు కావాలి. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు ఉన్నా ఈ రెండు రోజులు స్థానిక బీఎల్‌వోలకు సంబంధింత ఫాంలు నింపి ఇవ్వాలి. మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో జనాభాకు, కొత్త ఓటరు నమోదులో వ్యత్యాసం ఉంది. అందరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం.

– వి.రాములు, ఓటరు నమోదు అధికారి (ఆర్డీవో), మంచిర్యాల

## ఓటరుగా నమోదు చేసుకోవాలి

నస్పూర్: అక్టోబర్ 1, 2023 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ సూచించారు. 2వ ఓటరు జాబితా సంక్షిప్త పునరీక్షణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 2, 3 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటరు నమోదు, ఓటరు జాబితాలో మార్పులు, సవరణలు, తొలగింపులకు ప్రభుత్వం ఈ అవకాశం కల్పిస్తుందని వివరించారు. వివరాలకు అన్ని పోలింగ్ కేంద్రాలు, బూత్ స్థాయి అధికారులు, సహాయ ఓటరు నమోదు అధికారి, ఓటరు నమోదు అధికారి, జిల్లా ఎన్నికల కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చునని తెలిపారు. voter.eci.gov.in వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. టోల్ ఫ్రీ నంబరు 1950లో సంప్రదించవచ్చని సూచించారు.



బట్టల షాపులో ప్రచారం చేస్తున్న శేజల్, బీజేపీ శ్రేణులు



గొడవ పడుతున్న బీఆర్‌ఎస్, బీజేపీ శ్రేణులు

## చిన్నయ్యకు ఓటేయకండి..!

- బెల్లంపల్లిలో శేజల్ ప్రచారం
- మద్దతు తెలిపిన బీజేపీ నాయకులు..
- అడ్డుకున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

బెల్లంపల్లి: ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు వ్యతిరేకంగా ఆరిజిన్ డెయిరీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(సీఏవో) బోడపాటి శేజల్ శుక్రవారం బెల్లంపల్లిలో ప్రచారం చేసింది.. పట్టణంలోని బజారు ఏరియా రోడ్ నంబర్ 3లో షాపులకు వెళ్లి.. 'ఎమ్మెల్యే చిన్నయ్య కామాంధుడు.. నన్ను లైంగికంగా వేధించాడు.. ఆయనకు వచ్చే ఎన్నికల్లో ఓటు వేయొద్దు.. మళ్లీ గెలిపిస్తే మహిళలకు రక్షణ ఉండదు. చిన్నయకు తప్ప ఎవరికైనా ఓటు వేయండి' అని కోరింది. శేజల్ ప్రచారానికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోడి రమేశ్, పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఆమె వెంట ప్రచారంలో పాల్గొన్నారు. అరాచక ఎమ్మెల్యేను ధైర్యంగా ఎదుర్కొన్న శేజల్‌కు మహిళలు అండగా నిలవాలని బీజేపీ నాయకులు కోరారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో శంకరయ్య శేజల్ వద్దకు చేరుకుని ప్రచారాన్ని అడ్డుకున్నారు. బీజేపీ నాయకులు అభ్యంతరం చెప్పడంతో వెనక్కి తగ్గారు.

**అడ్డుకునేందుకు బీఆర్‌ఎస్ శ్రేణుల యత్నం..**

శేజల్ ప్రచారం సమాచారం తెలుసుకున్న బీఆర్‌ఎస్ శ్రేణులు ఒక్కసారిగా తరలివచ్చారు. ప్రచారాన్ని అడ్డుకునేందుకు యత్నించగా బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. పరస్పరం తోసుకున్నారు. ఎస్‌హెచ్‌వో శంకరయ్య మహిళా కానిస్టేబుళ్లతో వచ్చి శేజల్‌ను అదుపులోకి తీసుకుని ప్రత్యేక వాహనంలో తాళ్లగురిజాల ఠాణాకు తరలించారు.

**నిరసనగా రాస్తారోకో ...**

శేజల్‌కు బీజేపీ శ్రేణులు మద్దతు ప్రకటించడాన్ని నిరసిస్తూ భగత్‌సింగ్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ శ్రేణులు రాస్తారోకో చేశారు. దీంతో రాకపోకలకు అసౌకర్యం కలిగింది. పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళనకారులను చెదరగొట్టారు.

**చీర, సారెతో బీజేపీ నేత ఇంటికి..**

అనంతరం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పోస్టాఫీసు బస్తీలో ఉన్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోడి రమేశ్ ఇంటికి చీర, సారెతో వెళ్లారు. ఇంటి ఎదుట బైఠాయించి శిఖండి రాజకీయాలను మానుకోవాలని నినాదాలు చేశారు. మహిళలు గాజులు, చీర సారెను ఇంటిముందు పెట్టి నిరసన తెలిపారు. ఈతతంగం అరగంటకుపైగా కొనసాగింది. ఆతర్వాత పోలీసులు వచ్చి బీఆర్‌ఎస్ శ్రేణులను అక్కడి నుంచి పంపించారు.

## నెల రోజుల్లో ఏరియర్స్ చెల్లిస్తాం

- రూ.1,726 కోట్ల బకాయిలు చెల్లింపునకు నిర్ణయం
- నగటున కార్మికునికి రూ.4 లక్షలు అందుతాయని అంచనా
- డైరెక్టర్ (పర్సనల్,ఫైనాన్స్) ఎన్.బలరాం



డైరెక్టర్ ఎన్.బలరాం

నస్పూర్: సింగరేణి కార్మికులకు 11వ వేజ్‌బోర్డుకు సంబంధించిన 23 నెలల ఏరియర్స్ నెల రోజుల్లో చెల్లిస్తామని డైరెక్టర్ (పర్సనల్, ఫైనాన్స్) ఎన్.బలరాం శుక్రవారం తెలిపారు. సింగరేణి సీఅండ్‌ఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశాల మేరకు రెండు విడతలుగా ఎరియర్స్ ఉద్యోగుల ఖాతాల్లో జమ చేస్తామని పేర్కొన్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.1,726 కోట్ల బకాయిలు చెల్లించనున్నట్లు తెలిపారు. నగటున ఉద్యోగికి రూ.4 లక్షల వరకు అందుకుంటాడని వెల్లడించారు. వేతన బకాయిల లెక్కింపు ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించడానికి పర్సనల్ విభాగం, అకౌంట్స్, ఆడిటింగ్, ఈఆర్పీ, ఎస్‌ఏపీ, ఐటీ తదితర అన్ని విభాగాల సమన్వయంతో శుక్రవారం నుంచి ప్రక్రియను ప్రారంభించినట్లు వివరించారు. ప్రస్తుతం ఉద్యోగంలో ఉన్న వారికి చెల్లిస్తున్నామని, రిటైర్ అయిన ఉద్యోగులకు త్వరలో చెల్లిస్తామని తెలిపారు. 11వ వేజ్ బోర్డు వేతనాలను కోల్ ఇండియాలోని అన్ని సంస్థలక కంటే ముందుగా సింగరేణిలో అమలు చేశామన్నారు. దీంతో కంపెనీపై ఏడాదికి రూ.1,200 కోట్ల అదనపు భారం పడుతోందని తెలిపారు. ప్రస్తుతం చెల్లించే రూ.1,726 కోట్ల ఏరియర్స్‌తో కలిపి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.3 వేల కోట్ల భారం పడుతుందని వివరించారు.

### టెట్ కేంద్రాల ఎంపిక

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 15న ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్ –2 పరీక్ష నిర్వహించనున్నారు. ఈమేరకు జిల్లాలో పరీక్ష కేంద్రాలను ఎంపిక చేసినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. పరీక్ష నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు.

### ఇన్‌స్పైర్ గడువు పెంపు

మంచిర్యాలఅర్బన్: ఇన్‌స్పైర్ మనక్ గడువు సెప్టెంబర్ 30 వరకు పొడిగించినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఇప్పటి వరకు 298 పాఠశాలల నుంచి 1,200 నామినేషన్లతో జిల్లా రాష్ట్రస్థాయిలో ఐదో స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. 120 పాఠశాలల నుంచి నామినేషన్లు రాలేదని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.



ఓపీ కోసం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కిక్కిరిసిన రోగులు

## జిల్లాకు జ్వరం

- విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- ఫీవర్, జలుబు, దగ్గుతో ఆస్పత్రులకు..
- కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానాలు
- పెరుగుతున్న డెంగీ కేసులు



వార్డులో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

మంచిర్యాలటౌన్: జిల్లాకు జ్వరమొచ్చింది. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా చిన్నారులు జ్వరం, జలుబు, దగ్గుతో ఇబ్బంది పడుతున్నారు. నెల క్రితం భారీ వర్షాలు కురవగా, 20 రోజులుగా చినుకు జాడలేదు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వేసవిని తలపించేలా ఉక్కపోతతో, వాతావరణంలో మార్పులతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. పారిశుధ్యం సక్రమంగా లేకపోవడం, తాగునీరు కలుషితం కావడం, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించక పోవడం, దోమల వృద్ధితోనే వ్యాధులు ప్రబలుతున్నాయని వైద్యులు తెలిపారు.

**వైరల్ జ్వరాలే ఎక్కువ**

జిల్లాలో సీజనల్ వ్యాధుల్లో అధికంగా వైరల్ జ్వరాలే నమోదవుతున్నాయి. ప్రతీ కుటుంబంలో ఎవరో ఒకరు జ్వరం బారిన పడుతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులను నమోదు చేస్తుండగా, కేవలం ప్రభుత్వ ఆసుపత్రుల్లో నమోదవుతున్న వ్యాధుల వివరాల ప్రకారమే జిల్లాలో వైరల్ జ్వరాలు 71,456 నమోదు కాగా, డెంగీ కేసులు 35, టైఫాయిడ్ కేసులు 924 నమోదయ్యాయి. జ్వరం వచ్చి, అవి ఎలాంటివో నిర్ధారణ కానివి 13,140 నమోదయ్యాయి. ఇవి కాకుండా ప్రైవేటు ఆసుపత్రుల్లో వేల సంఖ్యలో జ్వర బాధితులు చేరుతున్నారు. వీటిని కూడా కలిపితే కేసుల కంటే రెట్టింపు అవుతుంది.

**సమ్మెలో సెకండ్ ఏఎన్‌ఎంలు..**

సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు వైద్య ఆరోగ్య శాఖ తగిన చర్యలను తీసుకోవాల్సి ఉన్నా, పూర్తిస్థాయిలో చర్యలు ఉండడం లేదు. సెకండ్ ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్న 162 మంది 16 రోజులుగా సమ్మె చేస్తున్నారు. దీంతో గ్రామీణులకు అవగాహన కల్పించడం లేదు. దీంతో సీజనల్ వ్యాధులను కట్టడి చేయడంలో ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా ఆస్పత్రిలో బెడ్‌లు సరిపోక, కరోనా ఐసోలేషన్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మడత మంచాలను వరండాల్లో వేసి చికిత్స అందిస్తున్నారు.

**జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నమోదు చేసిన సీజనల్ వ్యాధుల వివరాలు**

| | |
|---|---|
| వైరల్ జ్వరాలు | 71,456 |
| డెంగీ | 35 |
| టైఫాయిడ్ | 924 |
| జ్వర సంబంధిత వ్యాధులు | 13,140 |

### జాగ్రత్తలు తీసుకోవాలి



వాతావరణంలో మార్పులతో జ్వరం, జలుబు, దగ్గు వంటివి ఎక్కువగా వస్తున్నాయి. డెంగీ కేసులు నమోదవుతున్నా అవి వేరే జిల్లాలో నమోదై ఇక్కడికి వస్తున్నారు. మెడికల్ ఆఫీసర్లు వారి ఆసుపత్రి పరిధిలో వైద్య శిబిరాలను నిర్వహించి, ప్రజలకు వైద్యం అందిస్తున్నారు. సెకండ్ ఏఎన్‌ఎంలు సమ్మెలో ఉన్నా, పర్మినెంట్ ఏఎన్‌ఎంల తోపాటు, ఇతర వైద్య సిబ్బందితో సేవలను అందిస్తున్నాం. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి.

– డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా వైద్యాధికారి

## వైద్యం మరింత మెరుగు

- త్వరలో ప్రారంభం కానున్న 50 పడకల ఆసుపత్రి
- నిర్మాణంలో 100 పడకల ఆసుపత్రి భవనం
- చెన్నూర్‌కు అర్బర్ హెల్త్ సెంటర్ మంజూరు

చెన్నూర్: చెన్నూర్‌కు మరో ఆరోగ్య కేంద్రం మంజూరైంది. అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణానికి రూ.1.43 కోట్లు మంజూరు చేస్తూ ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రభుత్వ విప్ బాల్క సుమన్ తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

**మెరుగు పడనున్న వైద్య సేవలు..**

చెన్నూర్ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు మెరుగుపడనున్నాయి. చెన్నూర్‌లో ఇప్పటికే 50 పడకల ఆసుపత్రి భవనం నిర్మాణం పూర్తయింది. ప్రారంభించనున్నారు. మరోపక్క 100 పడకల ఆసుపత్రి నిర్మాణం వేగంగా జరుగుతోంది. ఈ క్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ మంజూరు కావడంతో వైద్య సేవలు మరింత మెరుగుపడనున్నాయి.

**భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని..**

వైద్య సేవల పరంగా చెన్నూర్ మూడు మండలాలకు కేంద్ర బిందువుగా మారింది. చెన్నూర్ మండల ప్రజలతోపాటు కోటపల్లి, వేమనపల్లి మండలాల ప్రజలు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చిన చెన్నూర్‌కు రావాల్సిందే. గతంలో చెన్నూర్‌లో 30 పడకల ఆసుపత్రి ఉండగా, మూడు మండలాల ప్రజలు వైద్య సేవలు పొందారు. ప్రస్తుతం దీనినే 50 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. మరో 100 పడలక ఆసుపత్రితోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరైంది. గతంలో మెరుగైన వైద్య సేవల కోసం మంచిర్యాలకు వెళ్లేవారు. మరో రెండు ఆసుపత్రులు పూర్తి అయితే ప్రజలకు ఇక్కడే మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయి.

## ఏరియా ఆసుపత్రిలో డాక్టర్ల కొరత తీర్చాలి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో డాక్టర్ల కొరత తీర్చాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. ఆసుపత్రి ఆవరణలో శుక్రవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. వైద్యుల కొరతతోపాటు పారామెడికల్ సిబ్బంది కొరత ఆసుపత్రిని వేధిస్తోందన్నారు. వెంటనే ఖాళీలు భర్తీ చేయాలన్నారు. కొత్తగా వచ్చిన వార్డు అసిస్టెంట్ల ఇంక్రిమెంట్, ఫ్లైడేల సమస్య తీర్చాలని పేర్కొన్నారు. ఆసుపత్రిలోని వార్డుల్లో చాలామట్టుకు ఏసీలు పనిచేయటం లేదని తెలిపారు. 11వ వేజ్‌బోర్డు తాలూకు 23 నెలల ఏరియర్స్‌తోపాటు సంస్థకు వచ్చిన లాభాల్లో వాటాను వెంటనే ఉద్యోగులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. మీటింగ్‌లో యూనియన్ కేంద్ర కార్యదర్శి అక్బర్‌అలీ, ఆంజనేయులు, సిస్టర్ సుజాత, నాగేంద్రభట్టు తదితరులు పాల్గొన్నారు.

### 'గూడెం' హుండీ లెక్కింపు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. మొత్తం 58 రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించగా, రూ.2,03,189 వచ్చినట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు. లెక్కింపులో దేవాదాయ శాఖ పర్యవేక్షణ అధికారి ముక్తారవి, వేద పండితులు, అర్చకులు, సిబ్బంది, సత్యనారాయణస్వామి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.



హుండీ డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది



## క్లుప్తంగా

### రోగులకే కొత్త రోగాలు వచ్చేలా..!


ఆసుపత్రి ఆవరణలో బయోవేస్టేజ్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి పలు వ్యాధుల బారిన పడిన వారు వచ్చి చికిత్సను పొందుతుండగా మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని సైతం ఇక్కడికే తరలించి వైద్యం అందిస్తున్నారు. పెరుగుతున్న రోగులతో పాటు, బయోవేస్టేజ్ సైతం పెద్ద ఎత్తున వస్తుండగా వారం రోజులుగా ఆస్పత్రి వెనకాల ఉన్న ఖాళీ స్థలంలో వేస్తున్న బయోవేస్టేజ్‌తో పాటు, చెత్తను తొలగించక పోవడంతో ఆసుపత్రి వెనకాల మొత్తం నిండిపోయింది. దీంతో దుర్వాసనతో పాటు, దోమలు పెరిగి, ఆసుపత్రిలో వివిధ వ్యాధులతో చికిత్సను పొందుతున్న రోగులకు కొత్త రోగాలు వచ్చేలా ఉన్నాయి.

### రైలు ఢీకొని ఒకరికి గాయాలు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హమాలీవాడలోని మూసివేయబడిన రైల్వేగేట్ దాటుతుండగా శుక్రవారం తెల్లవారు జామున గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియన వ్యక్తి (40) ఢీకొట్టిందని జీఆర్పీ హెడ్‌కానిస్టేబల్ సంపత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హమాలీవాడ గేటుదాటుతుండగా ప్రమాదవశాత్తు ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని పరిశీలించారు. గాయపడిన వ్యక్తి పూర్తిగా మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు, చిరునామా లభించకపోవడంతో గాయపడిన వ్యక్తిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతానికి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పూర్తి వివరాలకు నం.8328512176 సంప్రదించాలని తెలిపారు.

### పులిదాడిలో మేక హతం

- భయాందోళనలో గ్రామస్తులు


మేక కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

కాసిపేట: మండలంలోని పెద్దధర్మారం గ్రామ శివారులో శుక్రవారం మేకల మందపై పులిదాడి చేసి మేకను హతమార్చింది. స్థానికులు, అటవీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... గంగులు, రాములు అనే మేకల కాపరులు గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలోకి మేకలను తీసుకుని వెళ్లారు. ఒక్కసారిగా పులి దాడిచేసి మేకను చంపి పట్టుకుని వెళ్లిపోయింది. దీంతో మేకల కాపరులు అక్కడి నుంచి భయంతో గ్రామంలోకి వెళ్లి స్థానికులతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడ పరిశీలించగా మేక కళేబరం కనిపించింది. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా ఫారెస్ట్ రేంజ్ అధికారి సుభాష్, డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్‌నాయక్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అటవీ అధికారులు పరిశీలించి చిరుతపులిగా అనుమానం వ్యక్తం చేయగా స్థానికులు పెద్దపులి అనడంతో హైన, చిరుత పులి అడుగులకు పోలుతున్నాయని, ఈ పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో స్థానిక ప్రజలు అటవీ ప్రాంతం వైపు వెళ్లరాదని, ఈ ప్రాంతంలో చిరుతపులి ఉందని, పెద్దపులి అని అనుమానాలు వ్యక్తం చేయడంతో సీసీ కెమెరాల ఆధారంగా నిర్ధారించనున్నట్లు తెలిపారు.





# రద్దీగా బెల్లంపల్లి రైల్వేస్టేషన్

- బెల్లంపల్లి రైల్వేస్టేషన్ బిజీబిజీ
- పెరిగిన ప్రయాణికుల తాకిడి
- రెండు ప్రధాన రైళ్లు ఇక్కడి వరకే పరిమితం


టిక్కెట్ బుకింగ్ కౌంటర్ వద్ద ప్రయాణికుల రద్దీ

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ప్రయాణికులతో రద్దీగా మారింది. సికింద్రాబాద్ – బల్లార్షా, కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌ల మధ్య రోజువారీగా రాకపోకలు సాగించే రెండు ప్రధాన రైళ్లను తాత్కాలిక ప్రాతిపదికన బెల్లంపల్లి రైల్వేస్టేషన్ వరకు పరిమితం చేసి నడిపిస్తుండడంతో ఒక్కసారిగా ప్రయాణికుల తాకిడి పెరిగింది. వేలాది మంది ప్రయాణికులు బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకుని సుదూర ప్రాంతాలకు రాకపోకలు చేస్తున్నారు. ఈ కారణంగా రైల్వేస్టేషన్ బుకింగ్ ప్రాంగణం, రైల్వేస్టేషన్ ఫ్లాట్‌ఫామ్‌లు ప్రయాణికులతో కిటకిటలాడుతూ కనిపిస్తున్నాయి. సికింద్రాబాద్ – బల్లార్షా మధ్య నడిచే భాగ్యనగర్, సికింద్రాబాద్ –కాగజ్‌నగర్ మధ్య రాకపోకలు సాగించే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను గడిచిన ఐదు రోజుల నుంచి బెల్లంపల్లి రైల్వేస్టేషన్ వరకు పరిమితం చేశారు. బెల్లంపల్లి – కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌ల మధ్య మూడో రైల్వే లైన్, ఇంటర్ లాకింగ్ సిస్టం పనులు జరుగుతుండటంతో భాగ్యనగర్, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిర్దేశించిన గమ్యం వరకు నడిపించడానికి వీలు లేని పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో ఆ రెండు ప్రధాన రైళ్లను అప్ డౌన్ మార్గాల్లో బెల్లంపల్లి రైల్వేస్టేషన్ వరకు కుదించారు. ఇక్కడి నుండే నడిపిస్తుండటంతో బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌కు ప్రయాణికుల రద్దీ అధికమైంది. రోజువారీగా మూడు నుంచి నాలుగు వేల టిక్కెట్లు అమ్ముడుపోతుండగా ప్రస్తుతం ఆ సంఖ్య ఎనిమిది వేల వరకు పెరిగినట్లు తెలుస్తోంది.

**ఇతర ప్రాంతాల ప్రయాణికుల రాకతో...**

బెల్లంపల్లి రైల్వేస్టేషన్ సాధారణ రోజుల్లోనే ప్రయాణికులతో ఎంతో సందడిగా ఉంటుంది. దీనికి తోడు కొత్తగా భాగ్యనగర్, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు బెల్లంపల్లి స్టేషన్ నుంచి నడిపిస్తున్నారు. ఆసిఫాబాద్, రెబ్బెన, తాండూర్, తిర్యాణి, బెల్లంపల్లి, కాసిపేట, నెన్నెల, భీమిని, కన్నెపల్లి, మందమర్రి మండలాలతో పాటు చుట్టుపక్కల ఉన్న గ్రామీణ ప్రాంతాల ప్రజలు రైలెక్కడానికి బెల్లంపల్లికి వస్తున్నారు. గడిచిన ఐదు రోజుల నుంచి బెల్లంపల్లి రైల్వేస్టేషన్ సందడిగా మారి ప్రయాణికులతో కళకళలాడుతోంది. మరో పాతికరోజుల పాటు భాగ్యనగర్, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను బెల్లంపల్లి కేంద్రంగా నడిపించనున్నట్లు సమాచారం.


ఫుట్ ఓవర్ బ్రిడ్జికి కట్టిన ఫ్లెక్సీ


రైలు పట్టాలు దాటుతున్న ప్రయాణికులు

**దూరప్రాంతాలకు రైళ్లలో ప్రయాణం...**

హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, పెద్దపలి, జమ్మికుంట తదితర ప్రాంతాలలో నివాసం ఉంటున్న బంధువుల ఇళ్లకు, ఉన్నత చదువుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లిన కొడుకులు, కూతుళ్లను చూడటానికి రైళ్లలో ప్రయాణం చేస్తున్నారు. ఈ కారణంగా రైల్వేస్టేషన్‌కు ప్రయాణికుల తాకిడి అధికమైంది. రెండు ప్రధాన రైళ్లను బెల్లంపల్లి వరకే పరిమితం చేయడంతో అనివార్యంగా ఇతర ప్రాంతాల నుంచి ప్రయాణికులు ఆటోలు ఇతర వాహనాల్లో వచ్చి రైలెక్కి గమ్యస్థానం చేరుకుంటున్నారు. ప్రయాణికుల అవసరాన్నీ ఆసరా చేసుకుని ప్రైవేట్ వాహనాల యాజమానులు అధిక చార్జీ వసూలు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

**రైల్వే ఫైవంతెన మరమ్మతులతో...**

బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో ప్రస్తుతం పైవంతెన పనులు జరుగుతున్నాయి. ఒకటో నంబర్ ఫ్లాట్ ఫామ్ నుంచి రెండో నంబర్ ఫ్లాట్ ఫామ్‌కు పైవంతెన ద్వారా వెళ్లాల్సి ఉంటుంది. కొద్ది రోజుల నుంచి పైవంతెన మరమ్మతు పనులు జరుగుతుండటంతో రైలు ప్రయాణికులు రెండో నంబర్ ఫ్లాట్‌ఫామ్‌కు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఒకటో నంబర్ ఫ్లాట్ ఫామ్ దిగి పట్టాలు దాటి రెండో నంబర్ ఫ్లాట్‌ఫామ్ పైకి ఎక్కుతున్నారు. ఒక్కోసారి మధ్యలోని పట్టాలపై గూడ్స్ రైలు ఆగి ఉండడంతో ఆ రైలు కింద నుంచి దూరి ప్రమాదకర పరిస్థితుల్లో పట్టాలు దాటుతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సత్వరంగా పైవంతెన మరమ్మతు పనులు పూర్తి చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రయాణికుల రద్దీ పెరిగింది**

బెల్లంపల్లి రైల్వేస్టేషన్ వద్ద నుంచి భాగ్యనగర్, ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. బల్లార్షా, కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ వరకు వెళ్లాల్సి ఉండగా మూడో రైల్వే లైన్, ఇంటర్ లాకింగ్ సిస్టం పనులు జరుగుతుండడంతో తాత్కాలికంగా ఆ రెండు రైళ్లను బెల్లంపల్లి నుంచి నడిపిస్తున్నారు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి ప్రయాణికులు వస్తుండడంతో ఆయా రైళ్ల సమయంలో రైల్వేస్టేషన్ సందడి వాతావరణాన్ని సంతరించుకుంటోంది.

– ఎం.రవీందర్, రైల్వేస్టేషన్ మేనేజర్, బెల్లంపల్లి

### అలుపెరుగని అభిమానం

- వైఎస్సార్ ఘాట్ వద్ద మండలవాసి నివాళి


నివాళి అర్పిస్తున్న మోహన్‌రెడ్డి దంపతులు

జన్నారం: దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిపై ఇప్పటికి అభిమానం తగ్గ దం లేదు. నేటికీ ఆయన అభిమానులు స్మరిస్తూనే ఉన్నారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో ఆయనతో కలిసి పని చేసిన నాయకులు నేటికీ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి దంపతులు వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని రెండు రోజులు ముందుగానే ఇడుపుల పాయలోని వైఎస్సార్ ఘాట్ వద్దకు వెళ్లి నివాళి అర్పించారు.

### రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ఉద్యమించాలి

పాతమంచిర్యాల: రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ఉద్యమ పంథాలో నడవాలని బీసీ రాజ్యాధికార సాధన కమిటీ నాయకులు, ఎమ్మెల్యే ఆశావాహులు గాజుల ముఖేష్‌గౌడ్, నీలి శ్రీనివాస్, తోట శ్రీనివాస్, డాక్టర్ రఘునందన్, డాక్టర్ నీలకంఠేశ్వర్ రావు, డాక్టర్ రమణచుంచు రాజ్ కిరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలో బహుజన సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాజకీయ పార్టీలు బీసీల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ ఇస్తే ఆ అభ్యర్థినే గెలిపించుకుంటామని, ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకుంటే స్వతంత్ర్య అభ్యర్థిని ఉమ్మడిగా ఎన్నికల బరిలో నిలిపి గెలిపించుకుంటామన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గోనే ప్రకాష్‌రావు మాట్లాడారు. బీసీల నుంచి ఎమ్మెల్యే కోసం స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసే వారికి తనవంతుగా రుణ సాయంతో పాటు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. సాధన కమిటీ నాయకులు నరెడ్ల శ్రీనివాస్, వైద్య భాస్కర్ ఉన్నారు.

# ఆర్టీసీకి 'రాఖీ' పండుగ..!


పల్లె వెలుగు బస్సు

- టార్గెట్‌కు మించి ఆదాయం
- ఆదిలాబాద్ రీజియన్‌లో మంచిర్యాల నంబర్–1
- ఆదిలాబాద్ రీజియన్‌లో ఆదాయం రూ.1,42,35,601
- ఒక్కోరోజు ఆదాయం 126.24శాతం

మంచిర్యాలఅర్బన్ : నష్టాల్లోని ఆర్టీసీకి రాఖీ పండుగ కలిసొచ్చింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను తిప్పటంతో అనుకున్న టార్గెట్‌కు మించి ఆదాయం సమకూరింది. రాఖీ పండుగ నేపథ్యంలో హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు పెరిగాయి. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా, ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ ఆర్టీసీ ఆదిలాబాద్ రీజియన్ నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌కు ఉద్యోగ రీత్యా వెళ్లినవారు.. చదువుల నిమిత్తం ఉన్న విద్యార్థులందరూ సొంత ఊళ్లకు వచ్చి వెళ్తుంటారు. ఈ నేపథ్యంలోనే ఆదిలాబాద్ రీజియన్ నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. రోజువారీ బస్సుల కంటే అదనపు బస్సులను నడిపి ఆదాయం సమకూర్చుకుంది. రాఖీ పండుగ ఒక్కరోజు (గురువారం) ఆదిలాబాద్ రీజియన్‌లో రూ.1,12,76,453 ఆదాయ లక్ష్యసాధనకు రూ.1,42,35,601 సాధించింది. ఇందులో ఆరు డిపోల్లో మంచిర్యాల డిపోకు రూ.28,19,956 ఆదాయం టార్గెట్ విధించగా రూ.39,90,664 సాధించింది. రీజియనల్‌లో ముందు వరుసలో నిలచి ఫస్ట్ (నంబర్–1) స్థానం సాధించింది.

**హైదరాబాద్ నుంచి ఎక్కువగా..**

పండుగ నేపథ్యంలో జిల్లాకు అత్యధికంగా ప్రజలు హైదరాబాద్ నుంచి వస్తుంటారు. చదువు, ఉద్యోగంతో పాటు ఇతర అవసరాల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లివస్తుంటారు. రాఖీ పండుగ నేపథ్యంలో రద్దీ ఎక్కువగా ఉన్న దృష్ట్యా ప్రత్యేక బస్సులకు కేటాయించిన ట్రిప్పులకు అదనంగా తిప్పేందుకు ప్రణాళిక రూపొందించారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచారు. దీంతో అనుకున్న దానికంటే ఎక్కువ ఆదాయం సమకూరింది. సాధారణ రోజుల కంటే ఎక్కువగా బస్సులు తిప్పటంతో లక్ష్యసాధన వైపు పరుగులు పెట్టింది. ఆదిలాబాద్ రీజియన్‌లో రాఖీ పండుగ ఒక్కరోజు 2,49,474 కిలో మీటర్లకు 2,65,582 (106.46శాతం) బస్సులు తిరిగాయి. ఎర్నింగ్ ఫర్ కిలోమీటరు (ఈపీకే) 45.2 గాను 53.60(118.59శాతం) సాధించింది. ఆక్యుపెన్సీ రేషియో 71కి గాను 84 (118-53శాతం), ఎర్నింగ్ ఫర్ బస్సు (ఈపీబీ) 23,261 సాధించి మునుపెన్నడూ లేని విధంగా ఆర్టీసీ లాభాల బాట పట్టింది.

**మంచిర్యాల ఫస్ట్..**

ఆదిలాబాద్ రీజియన్‌లో ఆరు డిపోలో మంచిర్యాల డిపో ఆదాయ లక్ష్యసాధనలో నంబర్ వన్ స్థానంలో నిలిచింది. సాధారణ రోజుల్లో 60,895 కిలోమీటర్లు బస్సులు తిరగాల్సి ఉండగా పండుగ వేళ 66041 కిలోమీటర్లు తిప్పి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు. రూ.28,19,956 ఆదాయానికి రూ.38,90664 సాధించింది. ఈపీకే 46.31గాను 60.43 సాధించినట్లు మంచిర్యాల డిపో మేనేజర్ రవీంద్రనాథ్ తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల సమిష్టి కృషితోనే అనుకున్న లక్ష్యసాధనకంటే మించి ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.

**అందరి కృషితోనే ఆదాయం**



ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని ఉద్యోగులు, సిబ్బంది సమిష్టి కృషి ఫలితంగానే రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆదాయం సమకూరింది. ప్రయాణికులు అవస్థలు పడకుండా ఎప్పటికప్పుడు బస్సులను ఏర్పాటు చేశాం. గతంలో అదనపు చార్జీలు ఉండేవి. అయితే ప్రస్తుతం అదనపు సర్వీసులను నడుపుతూ మెరుగైన సేవలు అందజేస్తున్నాం.

– ప్రణీత్, డిప్యూటీ ఆర్ఎం (ఆపరేషన్స్)

**రీజియన్ పరిధిలో వచ్చిన ఆదాయం (రూ.లక్షల్లో)..**

| తేదీ | ఆదిలాబాద్ | భైంసా | నిర్మల్ | ఉట్నూర్ | ఆసిఫాబాద్ | మంచిర్యాల | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|
| ఆగస్టు 28న | 22.46 | 12.48 | 27.35 | 4.2 | 14.21 | 30.07 | 110.77 |
| 29న | 25.84 | 11.88 | 29.28 | 4.41 | 15.17 | 31.62 | 118.20 |
| 30న | 27.33 | 14.26 | 31.41 | 5.10 | 17.42 | 36.12 | 131.64 |
| 31న | 29.03 | 15.59 | 33.63 | 5.55 | 18.64 | 39.91 | 142.35 |

**రీజియన్ పరిధిలో ఓఆర్ వివరాలు..**

| తేదీ | ఆదిలాబాద్ | భైంసా | నిర్మల్ | ఉట్నూర్ | ఆసిఫాబాద్ | మంచిర్యాల | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|
| ఆగస్టు 28న | 68 | 69 | 72 | 66 | 68 | 75 | 71 |
| 29న | 70 | 64 | 71 | 72 | 79 | 78 | 73 |
| 30న | 75 | 75 | 79 | 78 | 82 | 87 | 80 |
| 31న | 79 | 77 | 83 | 83 | 85 | 93 | 84 |

# శ్రీరాంపూర్‌లో 79శాతం బొగ్గు ఉత్పత్తి


ఉత్పత్తి వివరాలను తెలుపుతున్న జీఎం రవిప్రసాద్

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలో ఆగస్టులో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం 79శాతం ఉత్పత్తిని సాధించినట్లు శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శుక్రవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆగస్టులో 4,46,500 టన్నులకు 3,51,736 టన్నులు సాధించారు. భూగర్భ గనుల్లో 93శాతం, ఓపెన్ కాస్ట్ గనుల్లో 73శాతం ఉత్పత్తిని సాధించినట్లు వివరించారు. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యంలో 81శాతం ఉత్పత్తిని సాధించినట్లు పేర్కొన్నారు. శ్రీరాంపూర్ లోని రెండు ఓసీపీ లలో అధిక వర్షాలు, ఓబీ సమస్యల వల్ల బొగ్గు ఉత్పత్తి కొంచెం తగ్గిందని అన్నారు. ఈ నెల 6 నుండి 900 మంది గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. డీజీఎం (ఐఈడీ) చిరంజీవులు, ఇంచార్జ్ డీజీఎం (పర్సనల్) రాజేశ్వర్‌రావు, సీనియర్ పీఓ కాంతారావులు పాల్గొన్నారు.

**బీపీఏలో 155 శాతం బొగ్గు ఉత్పత్తి**

రెబ్బెన(ఆసిఫాబాద్): గడిచిన నెలలో బెల్లంపల్లి ఏరియా 155 శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించిందని ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ అన్నారు. శుక్రవారం గోలేటి టౌన్‌షిప్ లోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. ఆగస్టులో 2లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా ఏరియా 3.09 లక్షల టన్నుల ఉత్పత్తితో 155 శాతం ఉత్పత్తిని సాధించామన్నారు. గత నెలలో ఏరియాలో వర్షాలు తక్కువగా కురియటం 100 శాతం ఉత్పత్తి సాధనకు దోహదపడిందన్నారు. సమావేశంలో ఎస్ఓటూజీఎం నరేందర్, డీజీఎం ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహరా తదితరులు పాల్గొన్నారు.


**మందమర్రి ఏరియాలో 82శాతం**

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో గత నెల 82శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామని ఏరియా జీఎం మనోహర్ శుక్రవారం తెలిపారు. కేకే–5 గనిలో 17,545 టన్నులు, ఆర్కే–1ఏ గనిలో 1,883టన్నులు, కాసిపేట గనిలో 12,789 టన్నులు, కాసిపేట–2 గనిలో 9,048 టన్నులు, శాంతిఖనిలో 4,716 టన్నులు, కళ్యాణిఖని ఓసీలో 91,055టన్నులు, రామకృష్ణాపూర్ ఓసీలో 132,316 టన్నులు అంటే ఏరియాలో ఓవరాల్‌గా 326,500 టన్నుల లక్ష్యానికి 269,352 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. కేకే–5గని, రామకృష్ణాపూర్ ఓసీ గనుల్లో వందశాతం ఉత్పత్తి లక్ష్యాన్ని దాటినందుకు ఆ గనుల ఉద్యోగులకు అభినందనలు తెలిపారు.

### రాత్రి షిఫ్టుల్లో కాంట్రాక్టర్ తనిఖీలు

మందమర్రిరూరల్: మందమర్రి ఎరియాలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు సంబంధించిన కాంట్రాక్టర్ మరొకరితో కలిసి ఇష్టారీతిగా రాత్రి షిఫ్టుల్లో సింగరేణి సెక్యూరిటీ ఆఫీసర్‌తో కాకుండా సెక్యూరిటీ గార్డుల పోస్టుల వద్దకు వెళ్లి గార్డులను డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ చేస్తున్నారని పలువురు గార్డులు ఆరోపిస్తున్నారు. సెక్యూరిటీ అధికారులతో కాకుండా కాంట్రాక్ట్ మాత్రమే సింగరేణి సెక్యూరిటీ పోస్టుల వద్దకు వెళ్లడం సరికాదని, సింగరేణికి సంబంధించిన విలువైన వస్తువులు చోరీకి గురయ్యే అవకాశం లేకపోలేదని పలువురు అధికారులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఇష్టారీతిగా గార్డులను నియమించుకుని పాత వారికి ఇబ్బంది కలిగిస్తూ కొత్త వారికి డ్యూటీలు కల్పించాలనే తనిఖీలు చేస్తున్నారని, కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న గార్డులు.. ఇది వరకు ఇలాంటి తనిఖీలు ఎరుగమని పేర్కొంటున్నారు. కాంట్రాక్టర్ తనిఖీలు మంచిదే కానీ సెక్యూరిటీ ఆఫీసర్లతో కలిసి చేస్తే బాగుంటుందని పలు వురు సూచిస్తు న్నారు. ఈ విషయమై సీనియర్ సె క్యూరిటీ ఆఫీసర్ రవిని వివరణ కోరగా కాంట్రాక్టర్ తనకు చెప్పి తనిఖీకి వెళ్లారని తెలిపారు.

### వేజ్‌బోర్డ్ ఎరియర్స్ చెల్లించాలి


ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మందమర్రిరూరల్: సింగరేణి ఉద్యోగులకు 23 నెలల వేజ్ బోర్డ్ వేతన బకాయిలను ఒకే దఫా చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏరియా జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య హాజరై మాట్లాడారు. ఏరియర్స్ బకాయిలు వచ్చే సాధారణ ఎన్నికల్లో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘానికి లబ్ధిపొందే విధంగా పంపిణీ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. అలాగే గత ఆర్థిక సంవత్సరం సంస్థ ఆర్జించిన లాభాల్లో 35శాతం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 7న జీఎం కార్యాలయం ముట్టడి, నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎరియా ఎస్వోటూ జీఎం రాజేశ్వరరెడ్డికి వినతిపత్రం అందించారు. మందమర్రి ఏరియా కార్యదర్శులు సత్యనారాయణ, దాగం మల్లేష్, అక్బర్‌అలీ, నాయకులు సుదర్శన్, లింగయ్య, వెంకటస్వామి, శ్రీనివాస్ ఉన్నారు.


**ఈ నెల 3లోగా చెల్లించాలి..**

నస్పూర్: 11వ వేజ్ బోర్డుకు సంబంధించిన 23 నెలల ఏరియర్స్‌ని ఈ నెల 3న చెల్లించాలని కోరుతూ హెచ్ఎంఎస్ నాయకులు శుక్రవారం ఆర్కే 7 గని సేఫ్టీ అధికారి రవిశంకర్‌కి మెమోరాండం అందజేశారు. ఇందులో గని పిట్ సెక్రటరీ సదరం రాజేంద్రప్రసాద్, సత్యవర్మ, రమేష్, కొండ మురళి, మోహన్, రమేష్, శ్రీను, మధుసూదన్ పాల్గొన్నారు.

# పెళ్లయిన నాలుగు నెలలకే కడతేర్చాడు

- 20 నిమిషాలకే రోడ్డు ప్రమాదంలో నిందితుడు దుర్మరణం
- అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త
- ఆదిలాబాద్ జిల్లా బంగారుగూడలో ఘటన
- ఇరు కుటుంబాల్లో విషాదం

ఆదిలాబాద్‌రూరల్: పెళ్లైన నాలుగు నెలలకే ఆ సంసారంలో అనుమానం పెనుభూతంగా మారింది. మూడు ముళ్లు.. ఏడు అడుగులు వేసి చివరి వరకూ తోడుగా ఉంటానని బాస చేసిన భర్తే.. అతికిరాతకంగా భార్యను హత్య చేశాడు. ఆపై పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోవడానికి వెళ్తూ.. ఆగి ఉన్న లారీని ఢీకొని దుర్మరణం చెందాడు. ఈ విషాద సంఘటనలు ఆదిలాబాద్ జిల్లా బంగారుగూడలో జరిగాయి. ఆ రెండు కుటుంబాలకు తీరని శోకాన్ని మిగిల్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదిలాబాద్ పట్టణానికి సమీపంలోని బంగారుగూడకు చెందిన జయవంత్‌రావు–పద్మ దంపతులకు ఏకైక కుమారుడు మోహితే అరుణ్(30)కు నిజామాబాద్ జిల్లా బాల్కొండకు చెందిన గోపిచంద్–లక్ష్మి దంపతుల చిన్న కూతురు దీప(22)తో నాలుగు నెలల క్రితం వివాహం చేశారు. దీప తల్లిదండ్రులు కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. అష్టకష్టాలు పడి కూతురు వివాహం చేసి ఆనందపడ్డారు. పెళ్లయిన నాటి నుంచి భార్యపై అరుణ్ అనుమానం పెంచుకున్నాడు. ఈ విషయంలో ఇరువురి మధ్య గొడవలు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆషాఢమాసం కావడం, భార్య పుట్టింటికి వెళ్లి నాలుగు రోజుల క్రితమే తిరిగి అత్తింటికి వచ్చింది. భార్యపై కక్ష్య పెంచుకున్న అరుణ్ శుక్రవారం తెల్లవారుజామున దీప తలను మంచానికి బాది అత్యంత కిరాతకంగా హత్య చేశాడు.


సంఘటన స్థలంలో అరుణ్ మృతదేహం

**లొంగిపోదామని..**

అనంతరం పోలీసుల ఎదుట లొంగిపోవడానికి ఆదిలాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌కు బైక్‌పై బయలుదేరాడు. అరుణ్ తల్లిదండ్రులు పద్మ, జయవంత్‌రావు విగతజీవిగా పడి ఉన్న కోడలును చూసి ఆందోళనకు గురయ్యారు. కొడుకు ఇంటి వద్ద కనిపించకపోవడంతో ఫోన్ చేశారు. రూరల్‌పోలీస్ స్టేషన్ వైపు వెళ్తున్నట్లు ఫోన్‌లో చెప్పగా వెంటనే తిరిగి ఇంటికి రావాలని కోరారు. దీంతో అతడు బైక్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఇంటికి తిరిగి వస్తాడనుకున్న కొడుకు మృతిచెందాడనే వార్త వినగానే తల్లిదండ్రులు మరింత షాక్‌కు గురయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు దీప ఇంటికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అలాగే అరుణ్ తల్లిదండ్రులను సైతం పోలీసులు విచారించగా కొన్నిరోజులుగా కుటుంబ కలహాలు ఉన్నాయని పోలీసులకు తెలిపారు. ఇదిలా ఉండగా కూతురు హత్యకు గురైన విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు లక్ష్మి, గోపిచంద్ రిమ్స్ ఆస్పత్రికి చేరుకుని విలపించిన తీరు అక్కడి వారిని కదిలించింది. కాగా మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అరుణ్ తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆదిలాబాద్‌రూరల్ ఎస్సై ముజాహిద్ వివరించారు. అరుణ్ మృతికి కారణమైన లారీ ఓనర్‌పై ఆదిలాబాద్ పట్టణంలోని టూటౌన్‌లో పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.